
డెడ్‌లైన్ సెప్టెంబరు 15

- శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో నాలుగో యూనిట్ రన్ చేయడానికి ఏర్పాట్లు
- పూర్తి కావొస్తున్న స్టార్టర్ వైండింగ్, 27న రోటర్ దించనున్న అధికారులు
- అన్నీ అనుకున్నట్లు జరిగాక మరోసారి హై ఓల్టేజీ టెస్టు, తర్వాత ఉత్పత్తి
- ఎడమ జల విద్యుత్ కేంద్రంలో ప్రమాదం జరిగి నేటికి ఐదేళ్లు
- బాధిత కుటుంబాలకు పరిహారం, ఇంటికొకరు ఉద్యోగాల్లో నియామకం


ప్రమాద సమయంలో జల విద్యుత్ కేంద్రంలో ఎగసి పడుతున్న మంటలు(ఫైల్)


శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న నాలుగో యూనిట్ మరమ్మతు పనులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే ఒత్తిడిలో బ్యాటరీలను మారుస్తుండగా శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో మంటలు చెలరేగి తొమ్మిది మంది సజీవ దహనమైన దుర్ఘటనకు నేటికి ఐదేళ్లు పూర్తవుతోంది. 2020 ఆగస్టు 20వ తేదీన ఈ దుర్ఘటన జరగ్గా జెన్‌కో ఉద్యోగులు ఏడుగురు, ప్రైవేటు కంపెనీకి చెందిన ఉద్యోగులు ఇద్దరు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో నాలుగో యూనిట్ పూర్తిగా కాలిపోగా సుమారు రూ. 100 కోట్ల మేర ఆస్తినష్టం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఐదేళ్లుగా నాలుగో యూనిట్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జెన్‌కో కష్టపడుతున్నప్పటికీ ఇంకా పనులు పూర్తికాలేదు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి సీజన్ కొనసాగుతుండగా సెప్టెంబరు 15 వరకు పనులు పూర్తిచేసి నాలుగో యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నారు. ఇప్పటికే స్టేటర్ వైండింగ్ పనులు పూర్తి కావొస్తుండగా బార్ గ్రేసింగ్, ఎండ్ క్యాప్స్ ఫిల్లింగ్ పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. ఆగస్టు 27వ తేదీన స్టేటర్ పనులు పూర్తిచేసి రోటర్‌ను దించడానికి నిర్ణయించారు. ఆ తర్వాత అప్పర్ బ్రాకెట్స్, ప్లేట్స్ బిగించి మరోసారి హెచ్‌వీ (హై ఓల్టేజీ) టెస్టును పూర్తిచేయనున్నారు. ఆ తర్వాత విద్యుదుత్పత్తికి మార్గం క్లియర్ అవుతుందని అంచనాలు వేస్తున్నారు. జూలై 14వ తేదీ నాటికే నాలుగో యూనిట్‌లో మరమ్మతులు పూర్తిచేసి

(మిగతా 6లో..)

దుర్ఘటన తీరు ఇది

శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం పూర్తి అండర్‌గ్రౌండ్‌లో ఉంటుంది. జపాన్ సాంకేతికతతో నిర్మించిన ఈ హైడల్ పవర్ ప్రాజెక్టులో ఆరు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌లో 150 మెగా వాట్ల విద్యుదుత్పత్తి జరుగుతుంది. ఇందులో ఉత్పత్తి ప్రారంభించిన 20 సంవత్సరాలపాటు ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తలేదు. 2020 ఆగస్టు 20వ తేదీన విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునే క్రమంలో బ్యాటరీలపై ఒత్తిడి ఎక్కువైంది. ఈ క్రమంలో నాలుగో యూనిట్‌లో బ్యాటరీలు మారుస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఉవ్వెత్తున ఎగిసి పడిన మంటల్లో నాలుగో యూనిట్ పూర్తిగా కాలిపోగా ఐదుగురు ఇంజనీర్లు, ఇద్దరు ప్లాంట్ అసిస్టెంట్లు, ఇద్దరు అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ ఉద్యోగులు సజీవ దహనమయ్యారు. ప్లాంటును రక్షించాలని కష్టపడుతుండగా మంటలకు ఆహుతయ్యారు. ఈ దుర్ఘటనకు ఇద్దరు సీఈలను బాధ్యులుగా చేసి, వారి నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని విచారణలో గుర్తించిన తర్వాత వారిని ఎస్‌ఈలుగా డిమోట్ చేశారు. అయితే తర్వాత వారు మళ్లీ అడ్డదారుల్లో ప్రమోషన్ల కోసం ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. 9 మంది మృతికి కారణమైన వారిని నామమాత్రపు చర్యలతో వదిలేశారనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదిలా ఉంటే మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున జెన్‌కో పరిహారం అందించగా వారందరి కుటుంబ సభ్యుల్లో ఒక్కొక్కరి చొప్పున ఉద్యోగాలు కూడా ఇచ్చారు. ఈ దుర్ఘటనలో దాదాపు రూ. 100 కోట్ల మేర ఆస్తినష్టం జరిగింది.

గంజాయి విక్రేతల అరెస్టు

- 1.6 కిలోల గంజాయి, 3 ఫోన్లు స్వాధీనం
- గద్వాల డీఎస్పీ మొగులయ్య

7


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగులయ్య

ఏకధాటి వర్షం

- ఉమ్మడి పాలమూరులో స్తంభించిన జనజీవనం


రాజోలి: తుమ్మిళ్లలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర

7

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే


ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి

అచ్చంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని మన్నెవారిపల్లి హైలెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌లను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అచ్చంపేట జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి, హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రాణ నష్టం జరగొద్దు

- సరళాసాగర్, రామన్‌పాడు రిజర్వాయర్‌లను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిర బోయి


రామన్‌పాడు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిర బోయి

వనపర్తి/మదనాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో జన జీవనం స్తంభించిపోయింది. జిల్లాలో ఎక్కడ కూడా ప్రాణ, ఆస్తినష్టం జరగవద్దని ఇన్‌చార్జి కలెక్టర్ విజయేందిర బోయి వనపర్తి జిల్లా అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె వనపర్తి జిల్లాలోని సరళాసాగర్, రామన్‌పాడు రిజర్వాయర్‌లను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. పాత ఇళ్లల్లో నివాసముండే వారితో పాటు లోతట్టు ప్రాంతాలలో ఉండే గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలతో వాగులు, చెరువులు, కుంటలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. శిథిలమైన ఇళ్లలో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

జూరాల క్రస్ట్ గేట్ల మరమ్మతులు మరిచారు

- కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

గద్వాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఒకపక్క యూరియా కొరత, మరో పక్క సాగునీటి ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చి ప్రజల సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాకు గతేడాది వానాకాలంలో 15వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే.. ఈ ఏడాది 14,500 మెట్రిక్ టన్నులు ఇప్పటికే కేటాయించారు. అది రైతులకు చేరకుండా ఎక్కడికి వెళ్లిందని ఆయన ప్రశ్నించారు. జిల్లాకు రావాల్సిన యూరియా ఇతర ప్రాంతాలకు తరలినట్లు సమాచారం ఉందని ఆరోపించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

యూరియా కోసం.. రోడ్డెక్కిన రైతులు


అమరచింత ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

6

చేపపిల్లల పంపిణీకి గ్రీన్ సిగ్నల్

- టెండర్ల ప్రక్రియకు సెప్టెంబరు 1 వరకు గడువు
- ప్రభుత్వ నిర్ణయంతో మత్స్యకారుల్లో ఆనందం
- జిల్లాలో 2 కోట్ల 20 లక్షల చేప పిల్లలకు అనుమతి


పెద్దమందడి మండలం జంగమాయపల్లి చెరువులో చేప పిల్లల్ని వదులుతున్న అధికారులు (ఫైల్)

వనపర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా ఈ ఏడాది చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి మేరకు చేపపిల్లల టెండర్ల ప్రక్రియ నిర్వహించాలని రాష్ట్ర మత్స్యశాఖ కమిషన్ జిల్లా మత్స్యశాఖ అధికారులకు అనుమతులు ఇచ్చింది. మొన్నటి వరకు చేపపిల్లలు పంపిణీ చేస్తారో లేదో అనే అనుమానం ఉండేది. ప్రస్తుతం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 2.20 కోట్లచేప పిల్లలకు అనుమతి

జిల్లాలో 142 మత్స్యకారుల సంఘాలు ఉండగా, 13,600 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలో 900కు పైగా చెరువులు, 5 రిజర్వాయర్లు ఉన్నాయి. వీటిలో ప్రతీ ఏడాది 2.20 కోట్ల చేప పిల్లల్ని వదిలేవారు. ఈ ఏడాది కూడా జిల్లాలో 2.20 కోట్ల చేప పిల్లల్ని వదిలేందుకు అనుమతులు వచ్చినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. అదే విధంగా ప్రతీఏడాది మాదిరి ఈ ఏడాది జిల్లాకు 4 రకాల చేప పిల్లల్ని ఇవ్వాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. అందులో రౌట, బొచ్చ, బంగారు తీగ, మోస్తు వంటి రకాల చేప పిల్లల్ని చెరువుల్లో వదలనున్నట్లు తెలిపారు. చేప పిల్లల టెండర్ల ఆహ్వానానికి సెప్టెంబరు1వ తేదీ మధ్యాహ్నం వరకు అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

టెండర్లకు అనుమతులు వచ్చాయి

ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు వేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబరు 1వ తేదీ మధ్యాహ్నం వరకు చివరి గడువు, జిల్లాలో 2.20 కోట్ల చేప పిల్లల్ని పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించాం. గత ఏడాది లాగానే ఈసారి కూడా నాలుగు రకాల చేప పిల్లల్ని పంపిణీ చేస్తాం.

- లక్ష్మప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి

వద్దన్నా.. వాన

- 11 రోజులుగా కురుస్తున్న వర్షం
- నల్లరేగడి భూముల్లో పత్తి, మిరపకు నష్టం
- నిలిచిన రాకపోకలతో వ్యవసాయ కూలీలకు ఇబ్బంది
- నిలిచిపోయిన సస్యరక్షణ చర్యలు
- రవాణా సౌకర్యం లేక బడులు బంద్
- పుట్టీల్లోనైనా పాఠశాలకు వెళ్తామంటూ భీష్మించిన చెర్లతిర్మలాపూర్ విద్యార్థులు
- పాఠశాలకు పంపించిన తల్లిదండ్రులు


చారకొండ మండలం దొంతలగుట్ట ప్రధాన రోడ్డుపై భారీ వర్షాలకు ఏర్పడిన గోతి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో 11 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు నల్లరేగడి భూముల్లో పత్తి, మిర్చిపంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పదేళ్లకాలం నుంచి ఈ ఏడాది భారీ వర్ష పాతం నమోదు కావడం జిల్లా రైతాంగానికి ఊహించని నష్టాన్ని మిగిల్చింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో వానాకాలంలో 3.97లక్షల ఎకరాల్లో పత్తి, వరి, వేరుశనగతోపాటు ఇతర పంటలు సాగు చేస్తారు. తెలకపల్లి, అచ్చంపేట, కల్వకుర్తి పదర మండలాల్లో పత్తి సాగు చేసిన రైతులకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం నష్టాన్ని కలిగించింది. సస్య రక్షణ చర్యలకుఅవకాశం లేకుండా పోయింది. వరినాట్లు కూడా పడడం లేదు. దీని పర్యవసానంగా సీజన్‌లో ఉపాధి లేక వ్యవసాయ కూలీలు ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు.

అతలాకుతలం

జిల్లాలో కురుస్తున్న వానలు వ్యవసాయాన్ని అతలాకుతలం చేశాయి. మృగశిర కార్తెలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడంతో రైతులు పత్తి పంటను సాగు చేశారు. జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 84.9మిల్లీ మీటర్లు కాగా 90.5 మిల్లీమీటర్లు నమోదైంది. ఈ మాసంలో పత్తి సాగుకు అనుకూలమైన వాతావరణం ఉన్నప్పటికీ జూలై నుంచి పరిస్థితి క్రమంగా మారుతూపోయింది. ఈ నెలలో 116.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 173.9మిల్లీ మీటర్ల వాన కురిసింది. అప్పటి నుంచే పత్తి, మిరప చేళ్లకు సస్యరక్షణ చర్యలు చేసే అవకాశం లేకుండా పోయింది. ఆగస్టు మాసంలో వర్షపు రోజులు 12 కాగా ఈ వ్యవధిలో 71.5మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా 765.7మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది.

పుట్టీలలో బడికి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బడికి దూరమైన విద్యార్థులు పాఠశాలకు వెళ్తామని భీష్మించడంతో తాడూరు మండలం చెర్లతిర్మలాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు పుట్టీమీద వారిని బడికి పంపించారు. కేసరి సముద్రానికి నల్లవాగు నుంచి వరద పెరగడంతో నాగర్‌కర్నూల్‌కు రాక పోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఉయ్యాలవాడ, చెర్లతిర్మలాపూర్ మధ్యన బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యక తను గ్రామస్తులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఈ క్రమంలోనే వరద అధికం కావడం గ్రామం జలదిగ్బంధంలో ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. విద్యార్థులు పుట్టిలో ఉయ్యాలవాడ, నాగర్‌కర్నూల్‌లోని పాఠశాలలకు రావడం అందరి దృష్టిని ఆకర్షించింది. జిల్లాలోని పెద్దకొత్తపల్లి, తాడూరు, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ మండలాల్లో భారీ వర్షాల కారణంగా రాకపోకలు నిలిచిపోవడంతో 21 ప్రభుత్వ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రవాణా సౌకర్యం మెరుగుపడేంత వరకు అక్కడ సెలవులను ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ తెలియజేశారు.

భారీ వర్షాలతో కూలిన ఇళ్లు..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో పాత ఇళ్లు కూలిపోయాయి. ఇప్పటి వరకు ఉన్న సమాచారం మేరకు జిల్లాలోని నాగర్ కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో మట్టి మిద్దెలు కూలిపోయాయి. పెద్దకొత్తపల్లి మండలంలో బాచారం గ్రామానికి చెందిన మొలకల బాలయ్య, దేదినేనిపల్లిలో దూదే కుల సుల్తాన్‌కు చెందిన ఇళ్లు పూర్తిగా నేలమట్టమయ్యాయి. భారీ వర్షాలకు పంటనష్టం జరిగినా జిల్లా స్థాయిలో మానిటరింగ్ చేయక పోవడం జిల్లా అధికారుల ఆదేశాలను కూడా పట్టించుకోకపోవడం పట్ల బాధితుల్లో ఆగ్రహం వ్యక్త మవుతోంది.


పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో భారీ వర్షాలకు నీట మునిగిన వరి చేను

వైభవంగా జములమ్మ కల్యాణం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు, పుర ప్రముఖులు


కల్యాణోత్సవంలో తాలిబొట్టును భక్తులకు చూపిస్తున్న పురోహితుడు

గద్వాల,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి):నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మదేవత కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ వెంకట్రాములు పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో గద్వాలకు చెందిన పురోహితులు మధ్యాహ్నం 12:15 నిమిషాలకు జమదగ్ని మహర్షిచే జములమ్మ దేవతకు మాంగళ్యధారణ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జములమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

వేలాదిగా తరలివచ్చిన భక్తులు..

అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కల్యాణోత్సవం తర్వాత స్వామి అమ్మవార్ల ఆశీస్సులను తీసుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముసురు వర్షం కురుస్తున్నా భక్తులు వర్షంలోనే తడుస్తూ కళ్యాణోత్సవం తిలకించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కల్వకుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మాల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్వకుర్తి పట్టణానికి చెందిన ఖాజామైనోద్దీన్(60), అబ్దుల్ ఖాదర్(70)లు మృతి చెందారు. మల్లేపల్లి నుంచి హైదరాబాద్‌కు డీసీఎంలో వెళ్తుండగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఖాజా మైనోద్దీన్, అబ్దుల్‌ఖాదర్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కల్వకుర్తికి తరలించారు.

నాకు ఇల్లు ఇవ్వలేదు... ఏం ఇవ్వలేదు.. ఇక చెప్పింది చాలు

- నారాయణపేట ఎమ్మెల్యే ప్రసంగం మధ్యలో గొడవ చేసిన మహిళ

ధన్వాడ, ఆగస్టు 19 : (ఆంధ్రజ్యోతి) : నాకు ఇల్లు ఇవ్వలేదు... ఏం ఇవ్వలేదు.. పింఛన్ డబ్బులు పెంచుతమన్నరు... ఫ్రీ బస్సు ఎవరికి అవసరం.. ముందుగా నాకు ఇల్లు ఇవ్వాలంటూ నారాయణపేట జిల్లా ధన్వాడలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రసంగం మధ్యలో ఓ మహిళ గొడవ చేశారు. ధన్వాడలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో చేనేత సంక్షేమ పథకాలపై మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే చేనేత పథకాలపై మాట్లాడుతున్న సమయంలో మణెమ్మ అనే మహిళ మధ్యలో లేచి ఫ్రీ బస్సు ఎవరు అడిగిన్రు... పెంచుతామన్న పింఛన్ డబ్బులు ఎందుకు ఇవ్వలేదు.... నాకు జాగ ఉంది ఇల్లు ఇస్తామని చెప్పి ఇల్లు ఎందుకు ఇవ్వలేదు అని సమావేశంలో కొద్ది సేపు గొడవ చేశారు. ఎమ్మెల్యేతో పాటు అక్కనే ఉన్న పార్టీ నాయకులు కొందరు అ మహిళను శాంతింపజేయడానికి ప్రయత్నించినప్పటికీ ఆమె వినకుండా ఏం ఇచ్చారు... ఏం మాట్లాడతారు అంటూ గట్టిగానే లీడర్లతో వాగ్వివాదానికి దిగారు. పోలీసుల జోక్యంతో లొల్లి చేసిన మహిళను సమావేశం నుంచి బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుడూ చేనేత అభివృద్ధికి తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరహరి, తహసీల్దార్ సింధూజ, పద్మాశాలి సంఘం కార్యవర్గ సభ్యులు బోర్ల శివాజీ, గోపికృష్ణ, కెంచె జయప్రకాష్‌తో పాటుగా పలువురు పాల్గొన్నారు.

చీరపైన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటం

- అభిమానం చాటుకున్న చేనేత కార్మికుడు గోపీకృష్ణ



చీరపైన వేసిన చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరిస్తున్న గోపీకృష్ణ

ధన్వాడ, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ధన్వాడ మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు గోపీకృష్ణ ఎమ్మెల్యే పర్ణికారెడ్డిపై తన అభిమానాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే చిత్రపటాన్ని చీరపై నేసి, ఫ్రేమ్ చేయించి మంగళవారం ఆమెకు బహూకరించారు. ఈ సందర్భంగా చీరపై తన చిత్రపటం ఎంతో బాగుందని ఆమె గోపీకృష్ణను అభినందించారు. అక్కడున్న వారందరికీ చూపించి సంతోషపడ్డారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీయూ రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రిజిస్ట్రార్ పూస రమేశ్‌బాబు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణలతో కలిసి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 803 మందికి గాను, 781 మంది విద్యార్థులు హాజరయ్యారని పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో తొమ్మిది యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. ఎగువ కేంద్రం లోని ఆరు యూనిట్ల ద్వారా 3.556 మిలియన్ యూనిట్లు, మొత్తం ఇప్పటి వరకు 254.762 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. దిగువ కేంద్రంలో మూడు యూనిట్ల ద్వారా 3.228 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యింది. ఇప్పటి వరకు 224.990 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

చిరుత దాడిలో వ్యక్తికి గాయాలు



చిరుత దాడికి గురైన గత్ప నరేశ్

గండీడ్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : చిరుత దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా, గండీడు మండల పరిధిలోని లింగాయపల్లి శివారులో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గత్ప నరేశ్ మంగళవారం ఉదయం ద్విచక్రవాహనంపై రంగారెడ్డిపల్లికి వెళ్లాడు. సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా చింతగుట్ట వద్ద చిరుతపులి అతడిపై దాడి చేసి పారిపోయింది. తీవ్రంగా గాయపడిన అతడు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఈ సంఘటనతో లింగాయిపల్లి, జక్లపల్లి, సాలర్‌నగర్, రంగారెడ్డిపల్లి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారు లు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

పక్కాగా ఉపాధి

- పనులు, కూలీల గుర్తింపునకు కఠిన నిబంధనలు
- పనికి ముందు, తర్వాత ఫొటోల అప్‌లోడ్
- నూతన మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్రం
- వచ్చేనెల 15 నుంచి అమలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అక్రమాలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గత నెల 8న సర్క్యులర్ జారీ చేసింది. పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో మార్పులు చేశారు. ప్రధానంగా కూలీల హాజరును రెండు సార్లు ఫొటోలతో నమోదు చేయడం తప్పనిసరి చేశారు. ఈ నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) విధానంలో అమలు చేస్తోంది.

మల్టీ లెవల్ వెరిఫికేషన్

ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశానికి వెళ్లి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తారు.

పంచాయతీ కార్యదర్శులు ఫొటోల నా ణ్యత, సరిపోలికలను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత మండల, జిల్లాస్థాయి అధికారులు కనీసం 20 శాతం ఫోటోలను మాన్యువల్‌గా పరిశీలించి నిర్ధారిస్తారు. దీంతో తప్పు డు ఫొటోలు, లేదా ఒకే ఫొటో మళ్లీమళ్లీ అప్‌లోడ్ చేస్తే సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.

ఈకేవైసీతో ధ్రువీకరణ

'ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్' (ఈకేవైసీ) విధానంతో కూలీలను మరింత కచ్చితత్వంతో గుర్తించే అవకాశం కలుగుతుంది. కూలీల ఆధార్ వివరాలతో ఫొటోలను సరిపోల్చి, వ్యక్తిగత ధ్రువీకరణ చేస్తారు. రెండు ఫొటోలు సరిపోలకపోయినా, ఆధార్ నెంబర్ కలువకపోయినా వేతనాలను నిలిపివేసే అవకాశం ఉంటుంది.

మాన్యువల్ బ్యాకప్‌కు అనుమతి

గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అలాంటి సమయాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు మాన్యువల్ మస్టర్ రోల్స్ ద్వారా హాజరు నమోదు చేయొచ్చు. కానీ అందుకు పూర్తి డాక్యుమెంటేషన్ సాక్ష్యాలు, ఫొటోలు తప్పనిసరి. ఆ తరువాత సిగ్నల్ వచ్చినప్పుడు ఆ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

తాజా నిబంధనలు ఇవే..!

కొత్త సర్క్యులర్ ప్రకారం ప్రతీ రోజు కూలీల గ్రూపు ఫొటోలను రెండు సార్లు తీసి ఎన్ఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పని ప్రారంభ సమయంలో (ఉదయం 9 గంటలలోపు), మొదటి ఫొటో, పని ముగిసిన తరువాత (సాయంత్రం 4 గంటల తరువాత) రెండో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో కూలీల హాజరు, పని సమయాన్ని కచ్చితంగా నమోదయ్యే అవకాశం కలుగుతోంది. దీంతో నకిలీ హాజరు లేదా తప్పుడు ఫొటోల అప్‌లోడ్‌కు అవకాశం ఉండదు.

శిక్షణ, అవగాహన అవసరం

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తీసుకొచ్చిన నూతన విధానాలు రెండు ఫొటోలు, ఈకేవైసీ మల్టీ లెవల్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియల ద్వారా పారదర్శకత పెరుగుతుంది. ఈ విధానం అక్రమాలను అరికట్టడంలో సహాయపడుతుంది. కానీ గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్, ఇంటర్నెట్ అంతరాయాలు ఏర్పడుతుంటాయి. అప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేయడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. కూలీలకు వేతనాలు ఆలస్యం కావచ్చు. రెండు ఫొటోలు, మల్టీ లెవెల్ తనిఖీల వల్ల పనిభారం పెరుగుతుందని ఫీల్డ్ అసిస్టెంట్లు అభిప్రాయపడుతున్నారు. అందుకోసం వారితో పాటు, కూలీలకు కూడా పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించాల్సి ఉంది.

యూరియా కోసం.. రోడ్డెక్కిన రైతులు

- అమరచింత ప్రధాన రహదారిపై రాస్తారోకో
- అయిజ సింగిల్‌విండో కార్యాలయం దిగ్బంధం



అమరచింతలో యూరియా కోసం కూర్చున్న రైతులు

ఆత్మకూరు/ అమరచింత/ అయిజ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సాగు పనుల్లో నిమగ్నమై ఉండాల్సిన రైతులు కావలసినంత యూరియా దొరకక అవస్థలు పడుతున్నారు. సింగిల్‌విండో కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. అయినా యూరియా దొరకకపోవడంతో ఆందోళన బాట పడుతున్నారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూరు సింగిల్‌విండో కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం నుంచే రైతులు పడిగాపులు గాశారు. అయినా యూరియా దొరకక పోవడంతో ఆగ్రహించారు. ఉదయం 11 గంటలకు అమరచింత ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పక్కనే ఉన్న రేచింతల సింగిల్‌విండో కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని, ఆత్మకూరులో ఎందుకు ఉండదంటూ అధికారులను ప్రశ్నించారు. ఒక రైతుకు ఒక్కటే బస్తా ఇవ్వడం వల్ల ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నరేందర్ అక్కడికి చేరుకొని సింగిల్‌విండో అధికారులను పిలిపించారు. దీంతో సీఈవో నరేశ్‌కుమార్ వచ్చి మాట్లాడారు. అందరికీ యూరియా బస్తాలు ఇస్తామని నచ్చచెప్పారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు 20 టన్నుల యూరియా అందుబాటులోకి రావడంతో రైతులకు పంపిణీ చేశారు.



వర్షానికి తడవలేక చెప్పులను క్యూలైన్ లో పెట్టిన రైతులు

తెల్లవారుజామున 5 గంటల నుంచే..

అలాగే అమరచింతలోని ఆగ్రో రైతు సేవ కేంద్రానికి మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి క్యూలో నిలుచున్నారు. వర్షంలో తడుస్తూనే యూరియా కోసం ఎదురు చూశారు. అగ్రో సేవాకేంద్రం నిర్వాహకులు ఒక పట్టా పుస్తకానికి రెండు బస్తాల చొప్పున రైతులకు యూరియా పంపిణీ చేశారు.

అయిజలో ఉద్రిక్త వాతావరణం

జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ సింగిల్ విండో కార్యాలయాన్ని మంగళవారం రైతులు దిగ్బంధించారు. సింగిల్‌విండో కార్యాలయానికి మంగళవారం ఉదయం మార్క్‌ఫెడ్ నుంచి 300 సంచుల యూరియా వచ్చింది. అప్పటికే యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు ఒక్క సారిగా ఎగబడ్డారు. కార్యాలయంలోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీనితో చైర్మన్ సీటు ఉన్న కిటికి దగ్గర వచ్చి నినాదాలు చేశారు. దీంతో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని, పరిస్థితిని చక్కదిద్దారు. రైతులందరినీ క్యూలో నిలిచోబెట్టి, యూరియా పంపిణీ చేయించారు. పొలం విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఒక్కో రైతుకు 2 యూరియా బస్తాలను అందజేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో అడుగుకో గుంత



పెంట్లవెల్లి బస్టాండ్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సు

పెంట్లవెల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, పెంట్లవెల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణ అడుగుకో గుంతతో అధ్వానంగా తయారయ్యింది. 28 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ఈ బస్టాండ్‌ను నిర్మించారు. ఆ తర్వాత 10 సంవత్సరాల వరకు ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలు కొనసాగాయి. ఆ తరువాత వివిధ కారణాలతో బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడం లేదు. ఈ విషయంపై పెంట్లవెల్లి గ్రామానికి చెందిన మూలు మేఘరాజు అనే వ్యక్తి ఇటీవల నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో ఆర్టీసీ అధికారులు స్పందించి నెల రోజుల క్రితం బస్టాండ్‌ను వినియోగంలోకి తెచ్చారు. కానీ ఆవరణలో సీసీ లేకపోవడంతో గుంతమయంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరి నిండి అస్తవ్యస్తంగా మారింది. దీంతో ప్రయాణికులు, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు బస్సు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణలో సిమెంట్ కాంక్రీట్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

దేవాలయాలే టార్గెట్

- విగ్రహాల వెండి తొడుగుల చోరీ
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- రూ. 3.96 లక్షలు, రెండు బైకుల స్వాధీనం
- వెల్లడించిన మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి



దేవాలయాల్లో ఆభరణాలను దొంగిలించే దొంగను ప్రవేశపెట్టి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ జానకి

భూత్పూర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : దేవాలయాల్లో విగ్రహాల వెండి తొడుగులు, ఆభరణాలను చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తెలిపారు. కేసు వివరాలను భూత్పూర్ సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన తోక కర్నాకర్ అనే వ్యక్తి గత జూలై 31న చిన్నచింతకుంట గ్రామంలోని గంగాభవానీ దేవాలయం తాళాలు విరగ్గొట్టి లోనికి ప్రవేశించాడు. అమ్మవారి విగ్రహంపై ఉన్న ఒకటిన్నర కిలోల వెండి తొడుగును ఎత్తుకెళ్లాడు. అదే రోజు మద్దూరు గ్రామంలోని దేవాలయంలో వెండి ఆభరణాలను చోరీ చేశాడు. సంఘటనపై దేవాలయ కమిటీ సభ్యుడు కృష్ణయ్య ఫిర్యాదు చేయడంతో, పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు. అయితే నిందితుడు తోక కర్నాకర్ మంగళవారం అమ్మాపూర్ స్టేజీ వద్ద అనుమానస్పదంగా తిరుగుతుండగా చిన్నచింతకుంట ఎస్ఐ రాంలాల్, పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకొని విచారించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ దేవాలయాల్లో అతడు చేసిన చోరీలకు సంబంధించిన వివరాలను రాబట్టారు. పెద్దమండడి మండలంలోని మణిగిల్ల, వెల్టూరు, మానవపాడు మండలంలోని అమరవాయి, ఇటిక్యాల మండలంలోని షాబాద్, సాతర్ల, పెబ్బేరు మండలంలోని శాఖాపూర్, కొత్తకోట మండలంలోని చెర్లపల్లి, మదనాపూర్ మండలంలోని అజ్జకోలు గ్రామాల్లోని ఆలయాల్లో అతడు చోరీలకు పాల్పడ్డాడు. ఆయా దేవాలయాల్లో దాదాపు 7 కిలోల వెండి తొడుగులు, ఆభరణాలను చోరీ చేసి విక్రయించినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. రూ.3,96,200, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లుగా చెప్పారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ రాంలాల్, పోలీసు కానిస్టేబుళ్లు నిరంజన్‌రెడ్డి, విష్ణు, బాల్‌రెడ్డి, రవిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, చిన్నచింతకుంట ఎస్ఐ రాంలాల్ పాల్గొన్నారు.

డెడ్‌లైన్ సెప్టెంబరు 15

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకురావాలని భావించినప్పటికీ సాధ్యంకాలేదు. ఇప్పుడు తాజా గడువులోపు పనులు పూర్తవుతాయా అనేది తెలియాల్సి ఉంది. జెన్‌కో, కాంట్రాక్టు సంస్థ అయిన వాయిత్ ఏజెన్సీలకు చెందిన 25 మంది ఉద్యోగులు నిరంతరం పనులు చేస్తున్నారు. ఈ యూనిట్ ప్రారంభమైతే మరో 150 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అదనంగా జరగనుంది.

ఆది నుంచీ అవాంతరాలే...

ప్రమాదం జరిగిన తర్వాత నాలుగో యూనిట్ పునరుద్ధరణ కోసం ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారు. 2021 సెప్టెంబరులో పనులు ప్రారంభించగా 2023 జూలై చివరి నాటికి పూర్తిచేసి జెన్‌కోకు అప్పగించారు. 2023 జూలై 17న నాలుగో యూనిట్‌ను రన్ చేసి, గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 19 రోజుల్లో 70 గంటల వ్యవధిలో 11.60 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. 2023 ఆగస్టు 17న స్టార్టర్ వైండింగ్ బార్స్‌లో షార్ట్ సర్క్యూట్ కావడంతో మరోసారి మంటలు చెలరేగాయి. యూనిట్ కాలిపోయి అప్పటి నుంచి పనిచేయడం లేదు. కాంట్రాక్టు కంపెనీ జెన్‌కో సంస్థ సక్రమంగా రన్ చేయకపోవడంతోనే మంటలు చెలరేగాయని తప్పించుకునే ప్రయత్నం చేయగా జెన్‌కో నిపుణుల కమిటీతో విచారణ చేయించింది. ఇందులో మరమ్మతుల్లో నాసిరకం మెటీరియల్ వాడటం వల్లే ప్రమాదం జరిగిందని తేలింది. దీంతో వాయిత్ కంపెనీ లైసెన్సును బ్లాక్ లిస్టులో పెట్టారు. తర్వాత మళ్లీ అదే కంపెనీకి పనులు అప్పగించింది. ప్రస్తుతం పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. స్టార్టర్ వైండింగ్ బార్లు 950 వరకు ఉండగా అందులో 150 కాలిపోగా వాటిని తొలగించింది కొత్తవి చైనా నుంచి తెప్పించి ప్రస్తుతం బార్ గ్రీసింగ్ చేస్తున్నారు. అయితే ఈసారి యూనిట్‌లోని స్టార్టర్ బార్లు, రోటర్‌లో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తి ప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందే పసిగట్టేందుకు ప్రత్యేకమైన సెన్సార్లను బిగిస్తున్నారు. దీనివల్ల పనితీరును ప్యానెల్ మానిటర్‌లో గమనించి ప్రమాదం జరుగకుండా చూసుకునే వెసులుబాటు కలుగుతుందని ఇంజనీర్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు

- ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సునీత భగవత్



సోమశిల లలితాంబిక సోమేశ్వరాలయాన్ని సందర్శించిన తెలంగాణ ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సునీత భగవత్ , చిత్రంలో డీఎఫ్‌వో రోహిత్ గోపిడి

కొల్లాపూర్ , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేసన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సునీత భగవత్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండలంలోని సోమశిలలో సోమవారం రాత్రి ఆమె బస చేశారు. మంగళవారం ఉదయం క్షేత్రంలోని లలితాంబికా సోమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీఎఫ్‌వో రోహిత్ గోపిడిలతో కలిసి కృష్ణానదిలో స్పీడ్ బోట్‌లో అమరగిరి బలపాల తిప్పకు వెళ్లారు. అటవీశాఖ ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం నిర్మిస్తున్న వాచ్ టవర్‌ను పరిశీలించారు. కృష్ణానదీ తీర ప్రాంతాల్లో చేపట్టనున్న టూరిజం అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఎకో టూరిజం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కృష్ణానది పరివాహక ప్రాంతాలు, నల్లమల అందాలను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ సునీల్ హిరేమత్, ఎఫ్‌డీవో ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ అధికారి రామ్మోహన్, డివిజనల్ అధికారి చంద్రశేఖర్, కొల్లాపూర్ రేంజర్ ఈశ్వర్, అటవీ రేంజర్ దేవరాజు, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నార

రైతుల సంక్షేమానికి కృషి

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి
- లబ్ధిదారులకు కర్షకమిత్ర రుణాల పంపిణీ



రైతు వేణుగోపాలునాయుడుకు కర్షకమిత్ర రుణం చెక్కును అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

ఎర్రవల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలు రైతుల సంక్షేమానికి కృషి చేస్తాయని, ఇవి వారి బ్యాంకులని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కర్షకమిత్ర పథకం ద్వారా 11 మంది రైతులకు మంజూరైన రూ.1.12 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీసుకున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో రుణాలను తిరిగి చెల్లించి, డీసీసీబీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పంటలకు క్రిమిసంహారక మందులను పిచికారి చేసే డ్రోన్ కొనుగోలుకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ కోఆపరేటివ్ అధికారి గోళి శ్రీనివాసులు, సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు నరసింహులు, కృష్ణారెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.

గద్వాల యువతికి ప్రతిష్టాత్మక పురస్కారం



అమెరికాలోని మిట్టి ల్యాబ్స్ లిమిటెడ్‌లో విధి నిర్వహణలో గద్వాల యువతి డాక్టర్ కొంకతి ప్రీతి

- నాయక్ రస్తోగి అవార్డుకు ఎంపికైన కొంకతి ప్రీతి
- ఉత్తర్వులు జారీ చేసిన ఐఐటీ బాంబే డైరెక్టర్ శిరీష్ కేదారే

గద్వాల సర్కిల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన యువతి ప్రతిష్టాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. దివంగత జరీ చీరల వ్యాపారి కొంకతి సుదర్శన్ కుమార్తె డాక్టర్ కొంకతి ప్రీతి 'జియో ఇన్ఫార్మాటిక్స్ ఫర్ నేచురల్ రిసోర్సెస్ ఇంజనీరింగ్' అనే అంశంపై పీహెచ్‌డీ చేశారు. ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ రంగ పరిశోధనల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఐఐటీ బాంబే వారు ఇచ్చే ప్రతిష్ఠాత్మక నాయక్ రస్తోగి పురస్కారానికి ఎంపికయ్యింది. ఈ మేరకు ఐఐటీ బాంబే డైరెక్టర్ శిరీష్ కేదారే ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రీతి కుటుంబ సభ్యులు మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ పురస్కారం తమ కుమార్తెకు దక్కడం చాలా గర్వంగా ఉందని ఆమె తల్లి మాధవి సంతోషం వ్యక్తం చేశారు. ఐఐటీ బాంబేలో ఈ నెల 24న నిర్వహించనున్న కాన్వకేషన్ వేడుకల్లో ప్రీతికి పురస్కారం ప్రదానం చేయనున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆమె అమెరికాలోని మిట్టి ల్యాబ్స్ లిమిటెడ్‌లో రిమోట్ సెన్సింగ్ లీడ్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నందున కాన్వకేషన్‌కు హాజరు కాలేకపోతున్నదని చెప్పారు. అమెరికా నుంచే వర్చువల్‌గా పురస్కారాన్ని స్వీకరించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఐఐటీ డైరెక్టర్ శిరీష్ కేదారే, విభాగాధిపతి, ప్రొఫెసర్ సూర్య దుర్వాలకు ప్రీతి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

అక్క కోసం వెళ్తే ప్రాణం పోయింది


రేవంత్ (ఫైల్)

అలంపూరుచౌరస్తా/వడ్డేపల్లి/ఇటిక్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బస్సుకింద పడి బాలుడు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం, శనగపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. శనగపల్లె గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్ కృష్ణవేణిలకు కూతరు కనిష్క (6), కుమారుడు రేవంత్ (5) ఇద్దరు సంతానం. వీరు శాంతినగర్ పట్టణంలోని సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్‌లో అక్క ఎల్‌కేజీ, తమ్ముడు రేవంత్ నర్సరీ చదువుతున్నారు. వీరు రోజు పాఠశాల బస్సులో పోయి వస్తుంటారు. మంగళవారం కనిష్క ఒక్కతే స్కూల్‌కు వెళ్లింది. మంగళవారం సాయంత్రం పాఠశాల బస్సు రాగానే ఇంటివద్ద ఉన్న రేవంత్ అవ్వ మాణిక్యమ్మతో కలిసి అక్కను తీసుకురావడానికి వెళ్లాడు. మాణిక్యమ్మ కనిష్కను చేయి పట్టుకుని వెనక్కు తిరిగి చూస్తే రేవంత్ కనిపించలేదు. క్షణాల్లో పిల్లాడి రోదన వినిపించింది. తిరిగి చూస్తే బస్సు టైరు కిందపడి నలిగిపోయాడు. వెంటనే కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కానీ కాసేపటికే మృతి చెందాడని అక్కడి వైద్యులు తెలపడంతో తల్లిదండ్రుల రోదనలతో మిన్నంటాయి. బంధువులు, గ్రామస్థులు శాంతినగర్ పట్టణం చేరుకున్నారు. బాలుడి మృతదేహంతో అంతరాష్ట్ర రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. క్లీనర్ లేకుండా బస్సును పంపిన యాజమాన్యంపై, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన డ్రైవర్ సునీల్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాలుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని శాంతినగర్ ఎస్సై నాగశేఖర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో శాంతించారు. ఆనంతరం బాలుడి మృతదేహాన్ని గద్వాల ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో గొర్రెలకాపరి మృతి

పెద్దమందడి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాగమోని మేపు మల్లయ్య (40) ప్రతీరోజులాగే గొర్రెలను మేపుకోవడానికి అదే గ్రామానికి చెందిన పల్లె రాములు పొలం దగ్గరికి వెళ్ళాడు. పొలంలోని వ్యవసాయ బోరుబావి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు వేలాడుతున్న విషయం గమనించలేదు. గొర్రెల వెంట వెళ్లి విద్యుత్ వైరు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 1.6 కిలోల గంజాయి, 3 ఫోన్లు స్వాధీనం
- గద్వాల డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని షోలాపూర్ నుంచి గంజాయిని తెచ్చి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసినట్లు డీఎస్పీ మొగులయ్య తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి తీసుకొచ్చి, విక్రయిస్తున్న పట్టణ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వారు మంగళవారం ఉదయం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో గద్వాలకు చెందిన బాషామియ్యా, అయిజకు చెందిన పూర్ణ అంబదాస్, చాకలి పరశురాముడు ఉన్నారు. వారి నుంచి 1.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని విచారించారు. వారు ముగ్గురు 6 నెలలుగా మహారాష్ట్ర షోలాపూర్‌లో గంజాయి కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. చిన్న ప్యాకెట్లుగా చేసి, అయిజ, గద్వాల పట్టణాల్లో యువకులకు అమ్ముతున్నారు. ఇలా వారు ఇప్పటివరకు 30 మంది యువకులకు గంజాయి విక్రయినట్లు పోలీసు విచారణలో వెల్లడయ్యింది. విలేకరుల సమావేశంలో సీఐ టంగుటూరి శ్రీను, పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

మక్తల్‌లో మరో ముగ్గురు...

మక్తల్ (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణ సమీపంలోని ఓ వెంచర్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. మక్తల్ మండలంలోని కర్ని గ్రామానికి చెందిన భానుప్రసాద్, నాగర్‌కర్నూల్ జిల్లా, దేశిటిక్యాల గ్రామానికి చెందిన నీరిడి సాయిరాం, మంథని సాయికుమార్‌లు గంజాయి విక్రయిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందడంతో ఈ నెల 18న మక్తల్ పట్టణంలోని నారాయణపేటరోడ్‌లోని ఓ వెంచర్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 150 గ్రాముల గంజాయి, రూ.5వేలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు. దాడుల్లో పోలీసులు మనోహర్‌రెడ్డి, శ్రీను, నరేశ్, శశిధర్ పాల్గొన్నారు.

పట్టుబడిన బైకు దొంగ

జడ్చర్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల బస్టాండ్ క్యాంటీన్‌లో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లేందుకు యత్నిస్తున్న వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల కొత్తబస్టాండులో మంగళవారం ఈ సంఘటన జరిగింది. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి క్యాంటీన్ ముందు ద్విచక్రవాహనాన్ని నిలిపి వెళ్లిపోయాడు. అదే సందర్భంలో ఓ వ్యక్తి ఎవరూ చూడటం లేదని భావించి, ఆ వాహనాన్ని ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. ఆర్టీసీ సెక్యూరిటీ ఉద్యోగి లింగంపేట నర్సింహులు అతడిని గమనించి పట్టుకున్నాడు. ఆ తర్వాత జడ్చర్ల పోలీస్‌స్టేషన్లో అప్పగించాడు.

వృద్ధురాలి అదృశ్యం

మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని పోతన్‌పల్లి గ్రామానికి చెందిన గొల్ల చంద్రమ్మ(65) పది రోజుల క్రితం అదృశ్యమయ్యింది. చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఆమె కోసం బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉండవల్లి మండలంలో యువతి...

అలంపూరు చౌరస్తా (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యం అయ్యింది. ఆ యువతి నెల రోజుల క్రితం మరో గ్రామంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. ఈ నెల 9న రాత్రి నుంచి ఆమె కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు బంధువులను, స్నేహితుల ఇళ్లల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

వాహనం ఢీకొని 10 గొర్రెలు మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గొర్రెలు

మిడ్జిల్, ఆగస్టు 19 : (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని 10 గొర్రెలు చనిపోయాయి. మిడ్జిల్ ఎస్‌ఐ శివ నాగేశ్వర్‌నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన కృష్ణయ్య, అతడి కుమారుడు శ్రీనివాసులు 150 గొర్రెలున్న తమ మందను మంగళవారం తెల్లవారు జామున కల్వకుర్తి - జడ్చర్ల ప్రధాన రహదారి మీదుగా తోలుకెళ్తున్నారు. అదే సమయంలో జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 10 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. సంఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


జడ్చర్ల మండలంలో అలగు వారుతున్న రంగనాయకుల చెరువు


నారాయణపేట జిల్లా మాగనూర్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న అడివిసత్యారం వాగు


నారాయణపేట జిల్లా కోత్తపల్లి -భూనేడ్ మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద పారుతున్న నీరు

ఏకధాటి వర్షం

- 48 గంటల నుంచి వదలని వాన
- ఉమ్మడి పాలమూరులో స్తంభించిన జనజీవనం
- పలు పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి సెలవు
- అలుగు పారుతున్న వాగులు, వంకలు
- గ్రామీణ ప్రాంతాలకు నిలిచిన రాకపోకలు


నారాయణపేట జిల్లా, ఊట్కూరులో అలుగు పారుతున్న చెరువు

నారాయణపేట/అచ్చంపేట/ జడ్చర్ల/ నవాబ్‌పేట/ కోయిలకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వారం రోజులుగా ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. చెరువులు అలుగు పారుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

● నారాయణపేట జిల్లా మంగళవారం రోజంతా ముసురు వర్షం కురుస్తూనే ఉంది. మక్తల్ మండలంలోని సంగంబండ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మాగనూర్ మండలంలోని అడవి సత్యారం బ్రిడ్జిపై వరద నీరు పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. బైరంపల్లి వద్దనున్న కల్వర్టుపై వరద ఉధృతి కొనసాగింది. కొత్తపల్లి - భూనేడ్ మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన వేసిన తాత్కాలిక మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. జిల్లా వ్యాప్తంగా 769 చెరువులు ఉండగా, 328 చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. 235 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీరు చేరుకున్నది. 152 చెరువుల్లో 50 నుంచి 75 శాతం నీరు చేరింది. 26 చెరువుల్లో 25 నుంచి 50 శాతం వరకు నీరు వచ్చింది. 28 చెరువులలో 25 శాతం లోపు నీరుచేఏరింది. 42.7 శాతం చెరువులు అలుగులు పారుతున్నాయి. 30.6 శాతం చెరువులు నిండేందుకు దగ్గరలో ఉన్నాయి.

● నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కారం బక్కలింగాయపల్లి, గణపూర్ అంజనేయతండా పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. నక్కలగండి ప్రాజెక్టులోకి దుందుబీ వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే రహదారిపై 10 అడుగుల మేర నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు ఆగిపోయాయి. అత్యవసరం అయితే పుట్టీల్లో అవతలి ఒడ్డుకు చేరుకోవాల్సి ఉంటుంది.

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల నియోజకవర్గంలో చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సమీపంలోని రంగనాయకులచెరువు, లింగంపేట సమీపంలోని గంజివాగు, నసరుల్లాబాద్ చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. దుందుబీ నదికి వరద ఉధృతి కొనసాగుతోంది. కొండేడు, లింగంపేట, నెక్కొండ, కుర్వగడ్డపల్లి, ఆల్వాన్‌పల్లి, గుట్టకాడిపల్లి చెక్‌డ్యాంలు నిండి పారుతున్నాయి. పోలేపల్లి - కిష్టారం, చెర్లపల్లి - నసరుల్లాబాద్, జడ్చర్ల - లింగంపేట గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. నవాబ్‌పేట మండలంలో దుందుబీ నది పరిధిలోని కారూర్ వాగుకు వరద పోటెత్తడంతో గ్రామసమీపంలోని చెక్‌డ్యాం కూలిపోయింది. కోయిలకొండ మండల కేంద్రం సమీపంలోని పెద్ద చెరువు అలుగు వారుతోంది. నవాబ్‌పేట మండలంలోని చౌడూర్ గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువు కట్టకు గండిపడింది. ఇది గమనించిన గ్రామస్థులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనె మరమ్మత్తులు చేయాలని అధికారులను కోరారు.

వరదలో కొట్టుకుపోయిన బైక్


నంది వడ్డెమాన్ వద్ద వరద నీటిలో ద్విచక్రవాహనంపై రోడ్డు దాటేందుకు యత్నిస్తూ కిందపడిన యువకులు

బిజినేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రహదారిపై ఉధృతంగా పారుతున్న వరద నీటిలో ఓ బైక్ కొట్టుకు పోయింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో మంగళవారం ఉదయం ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై బిజినేపల్లి నుంచి నందివడ్డెమాన్‌కు బయలు దేరారు. గ్రామ సమీపంలో రహదారిపై భీమసముద్రం చెరువు నీరు ఉధృతంగా పారుతోంది. పోలీసులు, స్థానికులు వద్దని వారిస్తున్నా వినకుండా రోడ్డు దాటేందుకు యత్నించడంతో బైక్‌తో సహా కొట్టుకుపోయారు. స్థానికులు స్పందించి వారిని కాపాడి, బైక్‌ను బయటకు లాక్కొచ్చారు.

ఘాట్ రోడ్‌లో విరిగి పడిన బండరాళ్ల తొలగింపు


శ్రీశైలం డ్యాం సమీపంలో రహదారిపై పడిన కొండ రాళ్లను తొలగిస్తున్న పోలీసులు

బ్రహ్మగిరి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, శ్రీశైలం ఘాట్‌రోడ్‌లో సోమవారం కొండ చెరియలు విరిగి పడ్డాయి. పెద్ద బండ రాళ్ల రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు కొంత ఇబ్బంది ఏర్పడింది. దీంతో మంగళవారం బ్రహ్మగిరి ఎస్‌ఐలు జయన్న, శ్రీనువాసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో బండరాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రానికి వచ్చే పర్యాటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బ్రహ్మగిరి నుంచి పాతాళగంగ వరకు ఉన్న ఘాట్‌రోడ్‌లో రక్షణ గోడలు చాలా వరకు కూలిపోయాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.


అచ్చంపేట మండలంలోని అక్కారం రహదారిపై రాకపోకలను నిలిపివేస్తూ అడ్డుగా వేసిన కంచె


నవాబ్‌పేట మండలంలోని కారూరు వద్ద కూలిపోయిన చెక్‌డ్యాం


అలుగు పారుతున్న కోయిలకొండ పెద్ద చెరువు

రెండు రోజులుగా వదలని ముసురు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూలు/గద్వాల/వనపర్తి, ఆగస్టు 19 (ఆంధజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానలు జోరుగా కురుస్తున్నాయి. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురు వానలకు జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వర్షం ఆగకుండా కురుస్తూనే ఉన్నది.

● నాగర్‌కర్నూలు జిల్లా కోడేరులో 25.4 మిల్లీమీటర్ల వర్షం కురువగా లింగాలలో 22.2, పెద్దకొత్తపల్లిలో 15.8, అచ్చంపేటలో 11.0, బిజినేపల్లిలో 10.6, మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో అత్యధికంగా 36 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మహబూబ్‌నగర్ రూరల్‌లో 24, అర్బన్‌లో 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మహ్మదాబాద్‌లో 31, జడ్చర్లలో 18, హన్వాడలో 22 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో 17 మి.మీటర్లు, మల్దకల్‌లో 15, కేటీదొడ్డిలో 12.4, గట్టులో 12.2, ఆలంపూర్‌లో 10.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో 18.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెబ్బేరు 16.4, శ్రీరంగాపూర్ 14.6, వనపర్తి 13.2, ఆత్మకూరు 12.4, మదనాపూర్ 11.2, పెద్దమందడి 10.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

● నారాయణపేట దామరగిద్ద మండలంలో 15.8 మి.మీ., ఊట్కూర్‌లో 14.5, నారాయణపేట మండలంలో 12.0, మాగనూర్ మండలంలో 10.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కూలుతున్న పాత ఇళ్లు


జడ్చర్ల మునిసిపాలిటీలోని శంకరాయపల్లితండాలో కూలిన ఇల్లు


జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదీస్ట్రీట్‌లో కూలిన ఇల్లు

నారాయణపేట/ మాగనూరు/ హన్వాడ/ జడ్చర్ల/ నవాబ్‌పేట/ రాజోలి/ చారకొండ, , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగు విడవకుండా పడుతున్న వానలతో పాత మట్టి మిద్దెలు, ఇళ్లు తడిసి కూలిపోతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని బాదీస్ట్రీట్‌లోని ఓ ఇంటి ముందు భాగం మంగళవారం తెల్లవారుజామున కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. 9వ వార్డు పరిధిలోని శంకరాయపల్లితండాలో హన్మంతుకు చెందిన ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ చైతన్యచౌహాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల్‌నాయక్, కిషన్, కృష్ణారావు, వార్డు ఆఫీసర్ జగన్ ఇంటిని పరిశీలించారు. నవాబ్‌పేట మండలంలోని రుద్రారం గ్రామంలో కుర్వ నరేశ్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు కూలిపోయింది. నారాయణపేట జిల్లాలో ఇప్పటి వరకు 97 ఇండ్లు పాక్షికంగా కూలిపోయాయి. ఊట్కూర్ మండలంలో 30 ఇళ్లు, కొత్తపల్లి మండలంలో ఒక ఇల్లు పాక్షి కంగా కూలాయి. .

దన్వాడ మండలంలో 19, దామరగిద్ద మండలంలో 2, కోస్గి మండలం లో 6, కృష్ణ మండలంలో 3 ఇండ్లు కూలిపో యాయి. మాగనూర్ మండలంలో 12, మక్తల్ మండలంలో 5, మరికల్ మండలంలో 12, నర్వ మండలంలో 7 ఇళ్లు పాక్షికంగా కూలాయి. హన్వాడ మండలంలో మంగళవారం 5 ఇళ్లు కూలిపోయాయి. టంకరలో 2, దాచకపల్లిలో 1, యారోనిపల్లిలో 1, మాదారంలో మరో ఇల్లు కూలిపోయింది. దాచకపల్లిలో కూలిన ఇంటిని బీజేపీ నాయకులు పరిశీలించారు.

● జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండలంలోని తుమ్మిళ్ల గ్రామంలో సుంకమ్మకు చెందిన మట్టిమిద్దె కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పచ్చర్లలోనూ ఓ ఇంటి పైకప్పు కూలిపోయింది.


పచ్చర్ల గ్రామంలో కూలిన మట్టిమిద్దె


హన్వాడ మండలంలోని దాచకపల్లిలో కూలిపోయిన ఇల్లు

కూలిన మట్టి ఇల్లు

నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని జూపల్లిలో జంతుక రాములుకు చెందిన ఇంటి పైకప్పు కూలిపోయింది. మండల కేంద్రంలో రెండు ఇళ్లు శిథిలావస్థలో ఉండటంతో ఆ కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు చారకొండ తహసీల్దార్ అద్దంకి సునిత తెలిపారు.

నిండిన ప్రాజెక్టులు

- కోయిల్‌సాగర్ 2 గేట్లు ఎత్తివేత
- 'సుంకేసుల'కు పోటెత్తిన వరద


కోయిల్‌సాగర్ 2 గేట్లు ఎత్తడంతో విడుదలవుతున్న నీరు

దేవరకద్ర/ మక్తల్ రూరల్/ రాజోలి/ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులు నిండు నీటితో కళకళలాడుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 32 అడుగులకు చేరింది. మొత్తం 13 గేట్లలో సోమవారం ఐదు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. పై నుంచి వరద తగ్గడంతో మంగళవారం మూడు గేట్లను మూసి వేసి, 2 గేట్ల ద్వారా 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ప్రతాప్ సింగ్ తెలిపారు. నీటి పరవళ్లను తిలకించేందుకు సందర్శకులు అధికసంఖ్యలో తరలివచ్చారు. యువకులు గాలాలతో చేపలు పడుతూ సందడి చేశారు.

'సంగంబండ' 2 గేట్ల నుంచి నీటి విడుదల

నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయం 2 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి పెద్ద వాగుకు వరద ఉధృతి తగ్గడంతో అధికారులు మంగళవారం ఉదయం 5 గేట్లను మూసి వేశారు. మరో 2 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయానికి 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1000 క్యూసెక్కుల ఔట్ ఫ్లో కొనసాగుతోంది. రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.60 టీఎంసీలనీరు నిల్వ ఉందని డీఈ సురేశ్ తెలిపారు.

'సుంకేసుల'కు 1.40లక్షల ఇన్‌ఫ్లో

జోగుళాంబ గద్వాల జిల్లా, రాజోలి మండల కేంద్రం శివారులోని సుంకేసుల జలాశయానికి ఎగువ నుంచి 1.40 లక్షల కూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో 9 గేట్లు మీటరు, 11 గేట్లు 2 మీటర్ల మేర ఎత్తి 1.38 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 290.20 మీటర్లుగా నమోదయ్యింది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 1.20 టీఎంసీలకు, ప్రస్తుతం 0.608 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కర్నూలు కేసీ కెనాల్‌కు 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ మద్దిలేటి తెలిపారు.

ఇంటర్వ్యూ..

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం

- ఎంపీడీవో శ్రావణ్‌కుమార్



కోడేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రజలకు అంటువ్యాధులు రాకుండా పరిసరాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీవో శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

గ్రామాల్లో వర్షాకాలం ప్రజలకు అంటువ్యాధులు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గ్రామాల్లో పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ వర్షపు నీరు ఆగకుండా బయటికి వెళ్లేలా డ్రైనేజీలు శుభ్రం చేయిస్తూ, బురద, మురుగునీరు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ తదితర కెమికల్స్‌ను స్ప్రే చేయిస్తున్నాం.

తాగునీటి సరఫరా ఎలా ఉంది ?

గ్రామాల్లో తాగునీటి సమస్య ఏమీ లేదు. మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నాయి. మైలారం గ్రామంలో మిషన్ భగీరథ పైపుల సమస్య వల్ల కొద్దిగా ఇబ్బంది ఉంది. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాం. మండల కేంద్రంలో ప్రైవేటు బావిని లీజును తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇస్తున్నారా?

గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, ఇతర కార్మికులకు మూడు నెలల వేతన బకాయిలు ప్రభుత్వం నుంచి చెల్లించడం జరిగింది. ప్రస్తుతం ఒక నెల చెల్లించాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

ఏటీసీ మంజూరు : ఎమ్మెల్యే



కందనూలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి ఐటీఐ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించినట్లు మంగళవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ స్థాయి టెక్నాలజీతో ప్రారంభమవుతున్న ఏటీసీతోపాటు రూ.45కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువరించినట్లు ఆయన తెలిపారు.

న్యాయ సేవలపై అవగాహన

తెలకపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సెక్రటరీ ఆదేశాల మేరకు చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ ఫర్ చిల్డ్రన్ స్కీం గురించి లీగల్ సర్వీసెస్ యూనిట్ ఫర్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం తెలకపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య హాజరై మాట్లాడారు. బాలల హక్కుల గురించి వివరిస్తూ.. బాలబాలికలందరూ ఫోన్ వాడకంలో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లో వచ్చిన మెసేజ్‌లను, వీడియోలను ఇతరులకు ఫార్వర్డ్ చేయడం గాని, వాటికి తిరిగి రిప్లై ఇవ్వడం గాని చేయరాదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గన్నారు.

'బ్రిడ్జిని పునర్నిర్మించాలి'

తెలకపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నాగర్‌కర్నూల్ రోడ్డు వైపున ఉన్న బ్రిడ్జి ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించినదని, పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని స్వేరోస్ పట్టణ అధ్యక్షుడు బారిగారి పరమేశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పట్టణ స్వేరోస్ నాయకులు మంగళవారం ఆ బ్రిడ్జిని పరిశీలించారు. తెలకపల్లి నుంచి ఈ బ్రిడ్జి ప్రధాన రహదారిపై ఉండటం వల్ల, వాహనదారులు భయభ్రాంతులతో ప్రయాణం చేస్తున్నారని పేర్కొన్నారు. పట్టణ ఉపాధ్యక్షుడు బల్మూరు మల్లేష్, జాయింట్ సెక్రటరీ లక్ష్మయ్య ఉన్నారు.

పంట పొలాల్లో వర్షపు నీరు నిలువకుండా చూసుకోవాలి

- వ్యవసాయాధికారి రమేష్

ఉప్పునుంతల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో వర్షం నీరు నిలువ లేకుండా రైతులు చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట పొలాల్లో వర్షం నీరు నిలువ ఉంటే బయటికి వెళ్లే విధంగా గండ్లు పెట్టాలని తెలిపారు. పంట పొలాల్లో వర్షం నీరు ఎక్కువగా నిలువ ఉంటే వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉంటుదన్నారు. అధిక వర్షాల కారణంగా రైతులు తగ్గ జాగ్రత్తలు పాటించాలని కోరారు.

విద్యుత్ వైరు సరి చేయండి

ఉప్పునుంతల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామంలో ఏడవ వార్డులోని కలమండల రామస్వామి ఇంటి సమీపాన మంగళవారం ఉదయం స్తంభానికి విద్యుత్ వైరు తెగిపోయింది. స్తంభం పై నుంచి తెగి వైరు పక్కన ఉన్న ఇళ్లపై పడింది. విద్యుత్ అధికారులకు సమాచారం ఇద్దామంటే ఫోన్‌స్విచ్చాఫ్ అయినట్లు సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు తెలిపారు. వైరుతెగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలచిపోయిందని, వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ వైరు సరిచేసి గ్రామ ప్రజలకు విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరారు.

భక్తి శ్రద్ధలతో పోచమ్మ బోనాలు

- బోనమెత్తిన మహిళలు, యువతులు
- ఈదమ్మ అమ్మవారి ప్రత్యేక దర్శనం
- పూనకంతో ఊగిన శివసత్తులు
- దర్శించుకున్న భక్తులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో మంగళవారం పోచమ్మ, ఈదమ్మ అమ్మవార్లకు బోనాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని సంతబజారులోని అమ్మవార్లు కొలువైన ఆలయ ప్రాంతం అంతా డప్పుల చప్పుళ్లు, అమ్మవారి నామధ్యానాలతో మార్మోగిపోయింది. పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి బోనం సమర్పించిన అనంతరం ఈదమ్మ అమ్మవారిని దర్శించుకుని కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రశాంత వాతావరణంలో ముగించారు.



మన్ననూరులో బోనాల ఊరేగింపులో డాక్టర్ చిక్కుడు అనురాధ



జిల్లా కేంద్రంలో పోచమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దేవునితిర్మలాపూర్‌లో....

పెద్దకొత్తపల్లి : మండలంలోని దేవునితిర్మలాపూర్, నక్కలపల్లి గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని పోచమ్మగుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ వి.సత్యం, మాజీ ఎంపీటీసీ సభ్యులు కొత్త ప్రతాప్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు వి.శ్రీనివాసులు, మేకల మల్లేష్, సీపీఐ మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు పాల్గొన్నారు.



పోచమ్మ ఆలయం వద్ద పూనకంతో ఊగుతున్న శివసత్తి

గోప్లాపూర్‌లో..

పెంట్లవెల్లి : మండల పరిధిలోని గోప్లాపూర్ గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. నాయకులు గురుకు ఆంజనేయులు, రైతు కమిటీ అధ్యక్షుడు తూము కుంట ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పిట్టల రాముడు పాల్గొన్నారు.

మన్ననూర్‌లో...

మన్ననూర్ : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రా మంలోని అంబేద్కర్ కాల నీలో ముత్యాలమ్మ బోనాల పండుగను భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర పాలకమండలి డైరెక్టర్ సంబు శోభ, మాజీ ఎంపీటీసీ బాలమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి బోనాలు..

తాడూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని అల్లాపూర్, ఆకునెల్లికుదురు, ఎట్టిధార్‌పల్లి, పాపగల్, భలాన్‌పల్లి, ఇంద్రకల్, గోవిందాయపల్లి తదితర గ్రామాల్లో పోచమ్మ దేవతకు బోనాలను భక్తులు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

తిమ్మాజిపేట : మండలంలోని గ్రామాల్లో పోచమ్మ బోనాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమ, పూలతో అలంకరించిన బోనాలతోపాటు మొలకల బుట్లు ఎత్తుకొని పోచమ్మ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకు న్నారు.



నాగర్‌కర్నూల్‌లో ఊరేగింపుగా బోనాలతో వస్తున్న ప్రజలు

జేపల్లిలో రేణుకా ఎల్లమ్మ బోనాలు

చారకొండ : మండల పరిధిలోని జేపల్లిలో గ్రామస్థులు రేణుకాఎల్లమ్మ దేవత బోనాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్ రవిందర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి : నక్కలపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న ప్రజలు



పెంట్లవెల్లి : గోప్లాపూర్‌లో పోచమ్మకు బోనాలు తీసుకెళ్తున్న ప్రజలు

కొల్లాపూర్‌లో మల్టీపర్పస్ ఆడిటోరియం

- రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించిన మంత్రి జూపల్లి

కొల్లాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన కొల్లాపూర్‌లో మల్టీపర్పస్ ఆడిటోరియం నిర్మాణానికి రూ. 3 కోట్ల నిధులు కేటాయించినట్లు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ విడుదల చేసినట్లు జీవో ఆర్‌టీ నెంబర్ 243 ఉత్తర్వులు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక ఎక్సైజ్ పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆన్‌లైన్‌లో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి మల్టీ పర్పస్ ఆడిటోరియం నిర్మాణానికి ప్రభుత్వం మూడు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందని దీంతో కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఎంత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనుకూలమైన ప్రదేశంలో మల్టీపర్పస్ ఆడిటోరియం నిర్మించి నియోజకవర్గ ప్రజలు వివిధ రకాల ఈవెంట్లు నిర్వహించుకునేందుకు అధునాతన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మల్టీపర్పస్ ఆడిటోరియంలో వ్యాపార సమావేశాలు సెమినార్లతో ఆటో ప్రైవేటు వ్యక్తులు సమావేశాలకు వీటిని ఉపయోగించుకోవచ్చన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, నృత్య ప్రదర్శనలు, సంగీత కచేరీల కోసం మల్టీపర్పస్ ఆడిటోరియం ఉపయోగపడుతుందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు వివాహాది కార్యక్రమాలకు సామాజిక కార్యక్రమాలకు మల్టీపర్పస్ ఆడిటోరియం ఉపయోగపడుతుందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

ప్రజల ఆహార భద్రతకు భరోసా

- రేషన్‌కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



నూతన రేషన్ కార్డుదారులతో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆహార భద్రతకు భరోసా ఇవ్వడానికి రేషన్ కార్డులను ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డు కేవలం ఒక పత్రం కాదని, ఇది పేద కుటుంబానికి భరోసా, భవిష్యత్‌కు ఆర్థిక బలం అని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్‌కార్డు మంజూరు చేయలేదని విమర్శించారు. అంతకు ముందు మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ యూసుఫ్ అలీ, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి, అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, నాయకులు తిరుపతిరెడ్డి, రమేష్‌నాయక్, అబ్దుల్ సమి, శ్యామ్ సుందర్ రెడ్డి, పర్వత్‌రెడ్డి, శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, ఆయూబ్‌పాషా, ఆరిఫ్, రవి, జంగయ్య, మధురెడ్డి ఉన్నారు.

సీపీఎస్ అంతం పీఆర్‌టీయూ టీఎస్ పంతం

- పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచందర్ రావు



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న పీటీఆర్ఎస్‌టీఎస్ నాయకులు

కొల్లాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పట్ల శాపంగా మారిన సీపీఎస్ విధానం రద్దుఅయ్యేంత వరకు పీఆర్ టీయూటీఎస్ ఆధ్వర్యంలో పోరాడుతూనే ఉంటామని ఆ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సీపీఎస్ విధానం అంతం కోరుతూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి ఆయన విడుదల చేశారు. సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పేర్కొంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి నాయకత్వంలో సీపీఎస్‌ను రద్దు చేయాలని నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, చంద్రారెడ్డి, ఈశ్వరయ్య, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

● నాగర్‌కర్నూల్ టౌన్ : ఉపాధ్యాయ, ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబరు 1న హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు దొడ్ల సత్యనారాయణరెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాగణంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు భవాండ్ల వెంకటేష్, ఉద్యోగ జేఏసీ జిల్లా కార్యదర్శి పి.రాజేఖర్‌రావు, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కార్యదర్శి తుమ్మల సురేందర్‌రెడ్డి, బిచ్యానాయక్, రాంచందర్‌రావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ముత్యాలు వర్ధంతి

వెల్దండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు, వెల్దండ గ్రామ తొలి సర్పంచ్ బికుమాళ్ల ముత్యాలు వర్ధంతిని మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం, ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ముత్యాలు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు ర్యాలీగా వెళ్లి కేజీబీవీ పాఠశాల ఆవరణలో ఉన్న ముత్యాలు సమాధి వద్ద మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, కార్యదర్శి గిరి, నాయకులు విజేందర్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వజ్రలింగం, అంజనేయులు, రాజయ్య, కృష్ణ, శ్రీను, రాజు, భరత్‌గౌడ్, కిష్టాలు, కిషన్‌రావు, వెంకటయ్య, శివకుమార్, సుదాకర్‌రెడ్డి, మదన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు కేజీబీవీ సిబ్బందికి సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఆయన పాఠ్యాంశాలను బోధించారు. ఎలాంటి పొరపాట్లు జరిగినా, విద్యార్థినులను నిర్లక్ష్యం చేసినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పాఠశాలల పరిశీలన

వంగూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న వర్షాలకు మంగళవారం మండలంలోని తిప్పారెడ్డిపల్లి, నిజాంబాద పాఠశాలలను ఎంపీడీవో బ్రహ్మచారి, ఎంఈవో మురళీమోహనాచారి పరిశీలించారు. పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నందున వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని, రైతువేదికలో పాఠశాలను నడపాలని హెచ్ఎం బాబురావును ఆదేశించారు. అదేవిధంగా నిజాంబాద పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడుతుంటంతో గ్రామపంచాయతీ భవనంలోకి పాఠశాలను మార్చలని హెచ్ఎం దినేష్‌కు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

బిజినేపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల భాస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని గ్రామంలోని వివిధ సంస్థల చిత్రపటాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని మంగనూర్ గ్రామంలో మంగళవారం రావేఫ్ (గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమం) విద్యార్థినులు పాఠశాల, బ్యాంక్, పంచాయతీ, రైతు వేదిక, ఆరోగ్య కేంద్రం, పోస్టాఫీసు, రేషన్ దుకాణం వంటి వాటి ద్వారా గ్రామ ప్రజలకు అందుతున్న సేవలు, వాటి ప్రయోజనాలపై పటాలు చిత్రీకరించి వివరించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థినులు అంకిత, మానస, శ్రీజ, మంజుల, స్వాతి, కీర్తి, పూజిత ఉన్నారు.

'దళిత వాడలపై చిన్న చూపు'

కోడేరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : దళిత వాడలంటే అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎందుకు అంత చిన్న చూపు అని సీపీఎం గ్రామ కమిటీ కార్యదర్శి పి.శివశంకర్ అన్నారు. మండల పరిధిలోని జనుంపల్లి గ్రామంలో పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రామస్వామి, పి.ధర్మేందర్, కాలనీ యువ కులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న ఫొటో గ్రాఫర్లు

అచ్చంపేటటౌన్ ఆగస్టు 19 (ఆంధ్రజోతి) : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మంగళవారం లూయిస్ డాగురే చిత్రపటానికి ఫొటో గ్రాఫర్లు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పలువురు మాట్లాడుతూ నేడు లక్షలాది కుటుంబాలకు జీవనోపాధిగా మారడంతో పాటు జీవితంలో ఫొటో చెదిరిపోని జ్ఞాపకంగా మిగిలిపోతుందన్నారు కాలగర్భంలో కలిసిన చరిత్రను ఫొటో సజీవంగా నిలుపుతుందన్నారు. ఫొటో గ్రాఫర్లు గౌరీ, బాలు పాల్గొన్నారు.

నిరంతర వానలతో జలదిగ్బంధంలో గ్రామాలు



సిర్సవాడ వద్ద కల్వకుర్తి వెళ్లే రహదారిపై నుంచి దుందుభీ నదిలోని కాజ్‌వేపై నుంచి ఉరకలేస్తున్న నీరు

తాడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు నిరంతరాయంగా కురుస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రాకపోకలు నిలిచిపోయి వరద నీరంతా ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులపై మళ్లు కోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం సైతం ఉదయంనుంచి వర్షం కురుస్తూనే ఉంది. అన్ని గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ముఖ్యంగా చెర్లతిర్మలాపూర్ గ్రామం నుంచి నాగర్ కర్నూల్ వెళ్లే రహదారిపై ఉయ్యాలవాడ గ్రామాల మధ్య నల్లవాగు పొంగడంతో కేసరి సముద్రం బ్యాక్ వాటర్ రహదారిని ముంచెత్తింది. దీంతో చెర్లతిర్మలాపూర్, ఉయ్యాలవాడ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో తిర్మలాపూర్ గ్రామ ప్రజలందరూ జలదిగ్బంధంలో చిక్కుకున్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులను పుట్టిలో తీసుకెళ్లారు. ఇంద్రకల్ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరద నీరు చేరుకుని ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రధాన రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలపై వరద నీరు ఎక్కి పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా దుందుభీ నది ఉరకలేస్తున్నది. ఎగువన బాలానగర్, రాజాపూర్, షాద్‌నగర్, పరిగి, జడ్చర్ల, మిడ్జిల్, తిమ్మాజిపేట తదితర మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో నది ప్రవాహం భారీగా కొనసాగుతోంది. 11రోజులు గా సిర్సవాడ నుంచి కల్వకుర్తి వెళ్లే ప్రధాన రహదారి దుందుభీ నదిలోని కాజ్‌వే నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో రాకపో కలు నిలిచిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● తిమ్మాజిపేట : ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రామకృష్ణయ్య అన్నారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అత్యవసర పనులకు తప్ప బయటకు వెళ్లవద్దని సూచిస్తూ విద్యుత్ స్తంభాలకు తాకవద్దన్నారు. అత్యవసర సమ యంలో కంట్రోల్ రూమ్ నెంబరు 08540293811కు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ తెలిపారు.

శేర్అప్పారెడ్డిపల్లి వాసికి డాక్టరేట్ పట్టా

చారకొండ ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శేర్ అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి మల్లెకేడి రాంచందర్‌జీ ఉస్మానియా విశ్వవిద్యాలయం 84వ స్నాతకోత్సవం సందర్భంగా ఇస్రో చైర్మన్, నారాయణ్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ ములుగరం చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. మహాశ్వేతాదేవి, కేశవరెడ్డి నవలల్లో గిరిజన జీవన చిత్రం అనే అంశంపై, డాక్టర్ కే చంద్రశేఖర్ రావు పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.రాజారత్నం, ప్రొఫెస్ సి.కాసీం, డాక్టర్ చువ్వా వెంకట్‌రెడ్డి, సిల్మానాయక్, చంద్రశేఖర్ రావు, అంబటి భాను, రాయిపర్తి శ్రీనివాస్, సుజాత అభినందించారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

- కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ఆన్‌లైన్ పోలీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు పోలీస్‌పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఓ కాపీ ఖచ్చితంగా మండపం వద్ద ఉంచాలన్నారు. డీజేలు ఏర్పాటు చేయరాదని, ఎక్కడైనా ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులు అందితే అక్కడి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● ఉప్పునుంతల : మండలంలో గణేశ్ ఉత్సవ కమిటీల ఆరు గణేశ్ మండలపాల కోసం అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

● ఊర్కొండ : మండల కేంద్రమైన ఊర్కొండతో పాటు అన్ని గ్రామాల్లో గణేశ్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ కృష్ణదేవ అన్నారు.

● కోడేరు : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గణేష్ ఉత్సవాల కోసం మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పక పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు.

గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

కల్వకుర్తి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కల్వకుర్తి ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దుండగులను తక్షణమే గుర్తించి, శిక్షించాలని కల్వకుర్తి ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వీరమల్ల వెంకటస్వామి కోరారు. అదే స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి రాజేష్, కోశాధికారి రాఘవేందర్, సభ్యులు వెంకటేశ్వర్లు, మధు సూదన్, జంగయ్య, నరేందర్, శ్రీనివాసులు, శ్రీను ఉన్నారు.

'అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి'

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ డిమాండ్ చేశారు. పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం గ్రామకమిటీ ఆధ్వ ర్యంలో మంగళవారం నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కల్వకోల్ గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కన్వీనర్ ఈశ్వర్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు దాసి, శివ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఆశావర్కర్ల ఆందోళన



వెల్దండలో ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

వెల్దండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆశావర్కర్లు ఆందోళన నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట ధర్నా చేపట్టిన అనంతరం వైద్యాధికారి సింధుకు వినతిపత్రం అందజేశారు. జూలై, ఆగస్టు నెలల పారితోషకం సకాలంలో చెల్లించడంతోపాటు తమకు రూ.18వేల వేతనం ఇవ్వాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వప్న, సుజాత, బాలమణి, పద్మ, భారతి, వసంత, మమత, లక్ష్మమ్మ, జయమ్మ, మంగమ్మ తదితరులు ఉన్నారు.

● చారకొండ : మండల కేంద్రమైన చారకొండలో ఆశా కార్యకర్తలు వైద్యాధికారి మంజు భార్గవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు విద్యారాణి, రజియా, సన, రజిత, స్వర్ణలత, సరిత, రాములమ్మ ఉన్నారు.

● బిజినేపల్లి : బిజినేపల్లిలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నమ్మ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్‌కు ఆశవర్కర్లతో కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆశవర్కర్ల డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 25 కలె క్టరేట్ ముట్టడి, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు కృష్ణవేణి, అలివేల, భాగ్యమ్మ, వెంకటమ్మ, సుకన్య లక్ష్మి, మానస, పద్మ ఉన్నారు.

● ఊర్కొండ : మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పర్యటనలో ఉండగా, ఆశ కార్యకర్తలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఆయనకు అందజేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు ప్రభావతి, భాగ్య, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.